

PRANTHIYAVARTHALU

ప్రాంతీయ వార్తలు

PRGI No : APTEL/25/A0899

నిజం కోసం నిరంతరం

తెలుగు దిన పత్రిక

TELUGU DAILY

prantheeyavartalu.com

prantiyavarthalu.pvnews@gmail.com

విశాఖపట్నం సంపుటి: 02 సంచిక: 25. 21- 11 -2026 (శనివారం) ఎడిటర్: పిళ్ళా సతీష్, పేజీలు : 4, వెల : రూ.5

VISAKHAPATNAM VOLLUME : 2, ISSUE : 25. 21-11-2026 (SAT DAY) EDITOR : PILLA SATHISH, PAGES : 4 PRICE : 5

విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా గాడు అలివేణి ఏకగ్రీవ ఎన్నిక

వైస్ చైర్మన్‌గా అజయ్ ఏఎస్ సుఖవాసి

జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం, ధ్రువీకరణ పత్రాల అందజేత







విశాఖపట్నం,**ప్రాంతీయ వార్తలు:** నవంబర్ 20: విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా భీమిలి జెడ్పీటీసీ సభ్యురాలు గాడు అలివేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా పెందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు అజయ్ ఏఎస్ సుఖవాసి ఎంపికయ్యారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. తొలుత నాలుగు మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. భీమిలి జెడ్పీటీసీ సభ్యురాలు గాడు అలివేణి పేరును ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు (జనసేన) ఎన్ని శ్రీనివాసరావు ప్రతిపాదించగా, పెందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు అజయ్ ఏఎస్ సుఖవాసి బలపరిచారు. బీసీ సామాజిక వర్గానికి కేటాయించిన చైర్‌పర్సన్ పదవికి గాడు అలివేణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రకటించారు. అనంతరం వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. అజయ్ ఏఎస్ సుఖవాసి పేరును చైర్‌పర్సన్ గాడు అలివేణి ప్రతిపాదించగా, పద్మనాభం జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవతి కోరాడ బలపరిచారు. దీంతో వైస్ చైర్మన్‌గా అజయ్ ఏఎస్ సుఖవాసి ఎంపికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. ఎన్నిక అనంతరం చైర్‌పర్సన్ గాడు అలివేణి, వైస్ చైర్మన్ సుఖవాసిలతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించి, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటు సభ్యుడు శ్రీ భరత్, ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ హాజరై నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయకముందే తండ్రి కన్నుమూత..!

నూతన మేయర్ ముక్కా శ్రావణి ఇంట తీవ్ర విషాదం..

మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాల నాయుడు మృతి..!





విశాఖపట్నం: **ప్రాంతీయ వార్తలు:** విశాఖ నగర నూతన మేయర్ ముక్కా శ్రావణి కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆమె తండ్రి, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాల నాయుడు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. శుక్రవారం తెల్లవారుజామున ఆయన అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచినట్లు సమాచారం. కుమార్తె మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టే వేడుకను కళ్లారా చూడాలన్న తండ్రి ఆశ నెరవేరకుండానే ఆయన కన్నుమూయడం కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచింది. ఈ వార్తతో బంధువులు, అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కుమార్తె జీవితంలో అత్యంత ఆనందకరమైన ఘట్టానికి ముందే తండ్రి దూరం కావడం ఆ కుటుంబానికి తీరని లోటుగా మిగిలింది.

ఈ నెల 23న విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం



విజయవాడ: **ప్రాంతీయ వార్తలు:** ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు విజయవాడ నగర మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నగరంలోని అంబేద్కర్ కళావేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్, 86 మంది కార్పొరేటర్లు కూడా అదే వేదికపై ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) కౌన్సిల్ హాల్‌లో స్థలాభావం కారణంగా అంబేద్కర్ కళావేదికను కార్యక్రమ వేదికగా ఎంపిక చేసినట్లు సమాచారం.

గంటాను కలిసిన జెడ్పీ చైర్ పర్సన్ అలివేణి



ప్రాంతీయ వార్తలు: విశాఖపట్నం, నవంబర్ 20: భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన గాడు అలివేణి శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు గంటా శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ప్రభుత్వానికి, పార్టీకి మంచి పేరు తెచ్చేలా పని చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. చైర్ పర్సన్ పదవి దక్కడానికి కారణమైన గంటాకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాడు వెంకటప్పడు, గాడు తాతి నాయుడు, గుడ్డాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ధర్మాచరణ, ఆధ్యాత్మిక చింతనతోనే సమాజానికి శాంతి, శ్రేయస్సు

కార్తీక మాస సత్సంగంలో కృష్ణచరణానందభారతీ స్వామివారి హితబోధ



డాబాగార్డెన్స్.. విశాఖపట్నం, నవంబర్ 20: సనాతన ధర్మం భారతీయ సంస్కృతికి మూలస్తంభమని, దాని పరిరక్షణ, ఆచరణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శ్రీ యాజ్ఞవల్క్యరాజాశ్రమ పీఠాధిపతులు, అభినవ వివేకానంద పూజ్యశ్రీ శ్రీశ్రీ డాక్టర్ కృష్ణచరణానందభారతీ స్వామివారు ఉద్బోధించారు. ధర్మాన్ని కేవలం ఆచార వ్యవహారాలకే పరిమితం చేయకుండా, నిత్యజీవితంలో సత్యం, ధర్మం, దయ, కరుణ, సేవాభావం, పరస్పర గౌరవం వంటి విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక చింతనతో కూడిన జీవన విధానమే వ్యక్తికి మానసిక ప్రశాంతతను, సమాజానికి శాంతి సౌభాగ్యాలను అందిస్తుందని ఆశీర్వచనం చేశారు. కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విశాఖ నగర ప్రజలకు కార్తీక మాస శుభ సందేశాన్ని అందించారు. డాబాగార్డెన్స్‌లోని వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం ప్రెస్ క్లబ్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సత్సంగం, ఆశీర్వచన కార్యక్రమంలో స్వామివారు ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా స్వామివారు మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ దేశాల్లో విశిష్టమైన ఆధ్యాత్మిక వారసత్వాన్ని కలిగిన పవిత్ర భూమి అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సనాతన ధర్మ సంప్రదాయాలు, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు మానవాళికి జీవన మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని వివరించారు. సనాతన ధర్మం అంటే ఒక మతానికి సంబంధించిన ఆచారాలు మాత్రమే కాదని, సమస్త మానవాళి శ్రేయస్సును, జీవుల పట్ల ప్రేమను, ప్రకృతి పట్ల గౌరవాన్ని, సర్వమానవ సమానత్వాన్ని బోధించే గొప్ప జీవన విధానమని పేర్కొన్నారు. ధర్మాన్ని ఆచరించడం ద్వారా మనిషిలో మంచి ఆలోచనలు, సత్ప్రవర్తన పెంపొందుతాయని, కుటుంబ వ్యవస్థలో ప్రేమాభిమానాలు, సమాజంలో సోదరభావం బలపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ భావితరాలకు సనాతన ధర్మ విలువలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్తీక మాసం ఆధ్యాత్మిక సాధనకు, దైవచింతనకు, దీపారాధనకు విశేషమైన మాసమని పేర్కొన్నారు. అయితే ఒక్క కార్తీక మాసమే కాకుండా ప్రతి మాసానికి ప్రత్యేక ఆధ్యాత్మిక విశిష్టత ఉందని వివరించారు. ప్రస్తుత అపార్ట్‌మెంట్ జీవన విధానంలో పక్క ఫ్లాట్‌లో ఏం జరుగుతున్నా తెలియని పరిస్థితి నెలకొందని, మానవ సంబంధాలు, పరస్పర ఆప్యాయతలు క్రమంగా తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భౌతిక అభివృద్ధితో పాటు మానవీయ విలువలు కూడా పెంపొందించుకోవాలని సూచించారు. విశాఖపట్నం శాంతికి మారుపేరైన నగరమని, అన్ని ప్రాంతాల ప్రజలను ఆదరించే గొప్ప సంస్కృతి ఈ నగరానికి ఉందని కొనియాడారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ 1936 నుంచి 110 దేశాల్లో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీయమని స్వామివారు పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులకు ఆధ్యాత్మిక విలువలను అందిస్తూ నమాజంలో శాంతి, సౌభ్రాతృత్వ భావనలను పెంపొందించేందుకు సంస్థ చేస్తున్న కృషిని ప్రశంసించారు. తాను గాడ్ లివ్డ్ స్టూడియోలో ప్రసంగించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

కార్య క్రమ నిర్వహకురాలు

బీకే రామేశ్వరి మాట్లాడుతూ కార్తీక మాసంలో దేశంలోని పుణ్యక్షేత్రాలు భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటాయని తెలిపారు. స్వామివారు విశాఖకు విచ్చేసి ఆధ్యాత్మిక సందేశాన్ని అందించడం శుభపరిణామమని, సనాతన ధర్మ పరిరక్షణ నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అభినవ వివేకానందగా ఖ్యాతిగాంచిన స్వామివారి బోధనలు సమాజానికి మార్గదర్శకమని అన్నారు.

జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ప్రపంచము లో ప్రజల కోసం. స్వామి.శాంతి సందేశాన్ని అందించడం అభినందనీయమన్నారు. విశాఖ నగరం అన్ని ప్రాంతాల ప్రజలను కన్నబిడ్డల్లా ఆదరిస్తుందని,

మిగతా వార్త.2లో

తిరుమలలో 16 కంపార్ట్‌మెంట్లలో భక్తుల వేచి ఉండటం

టోకెన్ లేని భక్తులకు సర్వదర్శనానికి 8 గంటల సమయం



ప్రాంతీయ వార్తలు: తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. ప్రస్తుతం 16 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనం కల్పించేందుకు సుమారు 8 గంటల సమయం పడుతోంది. ఇదిలా ఉండగా, నిన్న 67,915 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,399 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా రూ. 4.61 కోట్ల ఆదాయం సమకూరినట్లు వివరాలు వెల్లడయ్యాయి.

ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి భవానీ మండల దీక్షలు ప్రారంభం



ప్రాంతీయ వార్తలు: విజయవాడ, నవంబర్ 20: విజయవాడ ఇంద్రకీలాద్రిపై భవానీ మండల దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీక్షలు చేపట్టే భక్తుల కోసం దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీక్షదారులకు అర్చక స్వాములు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నేటి నుంచి ఈ నెల 24వ తేదీ వరకు మండల దీక్షలు కొనసాగనున్నాయి. అనంతరం డిసెంబర్ 10 నుంచి 14వ తేదీ వరకు అర్ధమండల దీక్షలు నిర్వహించనున్నారు. దీక్షల విరమణకు సంబంధించి డిసెంబర్ 30 నుంచి జనవరి 3వ తేదీ వరకు షెడ్యూల్‌ను దేవస్థానం విడుదల చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రశాంత్ అండ దండలు తో 96వ వార్డులో అక్రమ నిర్మాణం

కే.కే.ఆర్. వాటర్ ప్లాంట్ వద్ద నిబంధనలకు తూట్లు.. తొలగించిన నిర్మాణం మళ్లీ ప్రసన్నం చేసుకొని నిర్మాణం



ప్రాంతీయ వార్తలు: జీవీఎంసీ 96వ వార్డు పరిధిలోని కే.కే.ఆర్. వాటర్ ప్లాంట్ వద్ద భారీ భవన నిర్మాణం వివాదాస్పదంగా మారుతోంది. భవనానికి అనుమతులు ఉన్నప్పటికీ, అనుమతులకు మించి అదనపు అంతస్తు నిర్మించడమే కాకుండా మరో అదనపు పెంట్‌హౌస్ నిర్మాణానికి బిల్డర్ సిద్ధపడటంతో గతంలో జీవీఎంసీ ప్లానింగ్ విభాగం అధికారులు నిర్మాణాన్ని తొలగించారు

అయితే, అధికారులు తొలగించిన నిర్మాణం లక్షల్లో ముడుపులు తీసుకొని అక్రమ నిర్మాణం చేసారు స్థానిక జీవీఎంసీ ఎన్నికల సమయంలో తిరిగి అదనపు పెంట్‌హౌస్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

ఈ వ్యవహారంలో ప్లానింగ్ సెక్రటరీ ప్రశాంత్ కుమార్, సర్వేయర్ వ్యవహారశైలిపై కూడా స్థానిక ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బిల్డర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ భారీ మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు చేస్తున్న స్థానికులు, ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకసారి తొలగించిన అక్రమ నిర్మాణం మళ్లీ ఎలా కొనసాగుతోంది? అధికారుల పర్యవేక్షణ ఎక్కడ? నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సిన వారే చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భవన నిర్మాణ అనుమతులు, అదనపు అంతస్తులు, పెంట్‌హౌస్ నిర్మాణంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్‌గా మజ్జి సిరి సహస్ర ప్రమాణ స్వీకారం

ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు







విజయనగరం,**ప్రాంతీయ వార్తలు:** నవంబర్ 20: విజయనగరం జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా మజ్జి సిరి సహస్ర ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్ మజ్జి సిరి సహస్రకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందనలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళా నాయకత్వానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాజకీయ, పరిపాలనా రంగాల్లో మహిళలకు ఉన్నత బాధ్యతలు అప్పగించడం ద్వారా వారి నాయకత్వ సామర్థ్యాలకు గుర్తింపు, అవకాశాలు కల్పిస్తోందని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విజయనగరం జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు.

భారత్ జనాభా 147.66 కోట్లు.. మరో 40 ఏళ్లలో 170 కోట్లకు చేరే అవకాశం!



ప్రాంతీయ వార్తలు: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతోంది. దేశ జనాభా 147.66 కోట్లకు చేరినట్లు ఐక్యరాజ్యసమితి జనాభా నిధి నివేదిక అంచనా వేసింది. రానున్న 40 ఏళ్లలో భారత జనాభా 170 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని, ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టవచ్చని పేర్కొంది.

నివేదికలోని ముఖ్యాంశాలు:

దేశ జనాభాలో 26 శాతం మంది 10--24 ఏళ్ల మధ్య వయసున్న వారే.

15--64 ఏళ్ల మధ్య వయసున్న వారు 69 శాతంగా ఉన్నారు.

భారతీయుల సగటు ఆయుర్దాయం పురుషుల్లో 71 ఏళ్లు.

మహిళల్లో సగటు ఆయుర్దాయం 74 ఏళ్లు.

యువత అధికంగా ఉన్న భారత్‌లో రానున్న దశాబ్దాల్లో జనాభా నిర్మాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది.

అల్లూరి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా వంతల శాంతి ఎన్నిక



ప్రాంతీయ వార్తలు: పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పెదబయలు మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ సభ్యురాలు వంతల శాంతి ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ టి. నిశాంతి అధ్యక్షతన నిర్వహించిన జడ్పీ చైర్‌పర్సన్ ఎన్నికలో మొత్తం 11 మంది జడ్పీటీసీ సభ్యులకు గాను ఏడుగురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ సభ్యులు వంతల శాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ టి. నిశాంతి నూతన జడ్పీ చైర్‌పర్సన్ వంతల శాంతితో ప్రమాణ స్వీకారం చేయించారు. అదేవిధంగా వైస్ జడ్పీ చైర్మన్‌గా సీదరి రాంబాబు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికతో అల్లూరి జిల్లా పరిషత్‌కు నూతన నాయకత్వం ఏర్పడింది.

మొదటి పేజీ తరువాయి

సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

శాంతికాముక నగరంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.

బ్రహ్మ కుమారి బీకే సత్యవతి మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో విశిష్టత ఉందని, పరిశుద్ధమైన ఆలోచనలు, పవిత్రమైన మనసుతో జీవిస్తూ మంచి కార్యాలు చేపట్టాలని సూచించారు.

మీడియా పాత్ర కీలకం

సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో, ప్రజల్లో చైతన్యం కల్పించడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని స్వామివారు పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు, మంచి ఆలోచనలు ప్రజల్లోకి వెళ్లాలంటే మీడియా సహకారం అవసరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా బలంగా ఉండాలని, జర్నలిస్టులు, మీడియా సంస్థలను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ.. సీనియర్ పాత్రికేయులు ఆర్ నాగరాజు పట్నాయక్ లు మాట్లాడుతూ స్వామివారు విశాఖకు విచ్చేసి కార్తీక మాస ఆధ్యాత్మిక సందేశాన్ని అందించడం సంతోషకరమన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావం, ధర్మాచరణ, పరస్పర ప్రేమాభిమానాలతో శాంతియుత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ స్వామిని దీక్షిత నంద భారతి మాతాజీ తదితరులు పాల్గొన్నారు..

రెడ్ బుక్ పార్టీనా? రప్పరప్పా పార్టీనా?: విజయ్ సాయి రెడ్డి



ప్రాంతీయ వార్తలు: రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ అధినేత విజయసాయిరెడ్డి ఎక్స్ వేదికగా ప్రజల కోసం ఒక క్విజ్ను నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపోటములపై ఆయన వేసిన ఈ ప్రశ్న ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 'రెడ్ బుక్ పార్టీ', 'రప్పరప్పా పార్టీ' వంటి సెటైరికల్ ఆప్షన్లతో ఆయన చేసిన ఈ పోస్ట్ నెటిజన్ల నుంచి భిన్న స్పందనలను రాబడుతోంది. రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో, ఈ డిజిటల్ పోల్ ఎన్నికల వాతావరణాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది.

కావేరి జలాల వివాదం.. తమిళనాడు పిటిషన్లు కొట్టివేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: కావేరి నది జలాల పంపిణీ వివాదంలో తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కర్ణాటక ప్రభుత్వం నుంచి అదనంగా 11 టీఎంసీల కావేరి జలాలను విడుదల చేయించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేష్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 7 నాటికి తమకు రావాల్సిన నీటిలో సుమారు 11 టీఎంసీల కొరత ఉందని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు విన్నవించింది. ఈ నీటిని కర్ణాటక నుంచి తక్షణమే విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. అయితే, వర్షాభావ పరిస్థితులు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులను కారణంగా చూపుతూ కర్ణాటక ప్రభుత్వం తమిళనాడు వాదనలను వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారికి మరో అవకాశం

డిసెంబర్ 22న తుది ఓటర్ల జాబితా విడుదల.. నవంబర్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ



అమరావతి, **ప్రాంతీయ వార్తలు:** నవంబర్ 20: ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని ఓటర్లకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. (SIR) ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి అందకపోవడంతో గైర్హాజరు , నివాసం మారినవారు మరణించినవారు , ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైనవారు గా గుర్తించిన ౫ూణణ ఓటర్ల పేర్లు 2026 జూలై 31న ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో సంబంధిత ఓటర్ల జాబితాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి , సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి కార్యాలయాలతో పాటు ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. సంబంధిత ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను మళ్లీ పంపిణీ చేయనున్నారు. బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉన్న చిరునామాలకు నేరుగా లేదా వాట్సాప్, ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ ద్వారా ఫారాలను అందజేస్తారు. ఓటర్లు తమ ప్రస్తుత నంబర్ ఉపయోగించి ECI వెబ్‌సైట్ లేదా ECINET యాప్ ద్వారా కూడా ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేయవచ్చు.

దరఖాస్తు విధానం ఇలా..

నివాసం మారని ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారం తో పాటు స్టేట్‌మెంట్ ను సంబంధిత లేదా దీూకు నేరుగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా అందజేయవచ్చు. అలాగే ECINET యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఈ-సైన్ ఉపయోగించి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చు.

రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న ఓటర్లు ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదు. ఎన్యూమరేషన్ ఫారం , స్టేట్‌మెంట్ , చెల్లుబాటు అయ్యే కొత్త చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని తమ కొత్త అసెంబ్లీ నియోజకవర్గంలోని జు౫ా లేదా౫ూజు౫ాకు అందజేయాలి.

నవంబర్ 30 చివరి గడువు

ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియ నవంబర్ 30, 2026 వరకు కొనసాగుతుంది. సమర్పించిన వివరాలను పరిశీలించి ఆమోదించిన అనంతరం ఓటర్ల అసలు జూ×జ నంబర్‌ను యథాతథంగా ఉంచి, డిసెంబర్ 22, 2026న ప్రకటించనున్న తుది ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేస్తారు.

ఇప్పటికే (SIR) సమయంలో కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ లేదా యాప్‌లోని సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

PRANTHIYAVARTHALU
PRGI No : APTEL/25/A0899
నిజం కోసం నిరంతరం
ప్రాంతీయ వార్తలు
TELUGU DAILY

చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో

కార్తీక మాసం సందర్భంగా విశేష కుంకుమ పూజలు!

500 మంది అయ్యప్ప స్వాములు, భవానీలు, భక్తులు, పేదలకు అన్నసంతర్పణ!









ప్రాంతీయ వార్తలు: మధురవాడ, నవంబర్ 20 విశాఖపట్నం జిల్లా మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు వద్ద కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి, శ్రీ షిర్డీ సాయినాథుని సహిత శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీకమాసం శుక్లపక్షం ఏకాదశి శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నిత్యార్చనలతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చన తదితర పూజలను ఆలయ అర్చకులు పట్నాల హరిప్రసాద్ శర్మ, పట్నాల హరి చరణ్ తదితరులు నిర్వహించారు. అనంతరం కర్పూర హారతి, మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సాయంత్రం అమ్మవారికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణ అనంతరం కర్పూర హారతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో దీపారాధన సేవల్లో పాల్గొన్నారు.

వచ్చే నెలలో విజయవాడ ఇంద్రకీలాద్రి పై జరిగే చండియాగంకి వెళ్లడానికి 41 రోజు దీక్ష చేయు నిమిత్తం ఈరోజు శుక్రవారం కావడంతో ఆలయంలో వందల సంఖ్యలో భవానీ మాలలు ధరించారు, ఆలయం అంతా స్వాములు, భవానీలతో కోలాహలంగా మారింది,

ఆలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నసంతర్పణ కార్యక్రమంలో భాగంగా ఈరోజు శుక్రవారం చంద్రంపాలెం వాస్తవ్యులు పిళ్లా నర్సింగరావు, యల్లయ్యమ్మ దంపతుల కుమారులు పిళ్లా మోహన్ శివకృష్ణ, రేవతి (8వ వార్డు కార్పోరేటర్) మరియు కుటుంబ సభ్యులు సహాయ సహకారాలతో 500 మంది అయ్యప్ప స్వాములు, భవానీలు, భక్తులు, పేదలకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు,

ఈరోజు శుక్రవారం మద్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేసిన సందర్భంగా 8వ వార్డు కార్పోరేటర్ దంపతులు పిళ్లా రేవతి, మోహన్ శివకృష్ణ మరియు కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

అదే విధంగా మధురవాడ సంపత్ నగర్ వాస్తవ్యులు రామకృష్ణ జగన్నాధరావు, శైలజ దంపతులు మరియు కుటుంబ సభ్యులు అందించిన ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన పులిహోర ప్రసాదాన్ని అమ్మవారికి నివేదించి అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, ఉపాధ్యక్షులు పిళ్లా పోతరాజు, పిళ్లా మోహన్ శివకృష్ణ, జనరల్ సెక్రటరీ నాగోతి తాతారావు, సెక్రటరీ పోతిన పైడిరాజు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, ఉప కోశాధికారి పిళ్లా వెంకటరమణ, దుక్క వరం, జాయింట్ సెక్రటరీ పోతిన శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బంక వాసు, పొట్నూరి హరికృష్ణ, మీడియా ఇన్చార్జి బోగవిల్లి రాము, సోషల్ మీడియా ఇన్‌చార్జి మరుపిల్లి ఆనంద్

చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు,

కమిటీ సభ్యులు పిళ్లా రమణ, గూడేల కామేశ్వరరావు, కేశనకుర్తి అప్పారావు, పిళ్లా రాజు, సుందర శ్రీను, పిళ్లా గోకుల్, ముఖ్య సభ్యులు పిళ్లా బంగారి, నాగోతి అప్పారావు, పిళ్లా వెంకటరమణ, పిళ్లా అప్పన్న, శంకాబత్తుల శ్రీను, పిళ్ళా రాజు, జగుపిల్లి శివ, గుజ్జారి సింహాచలం, పోతిన రాంబాబు, అయ్యప్ప మాల ధరించిన స్వాములు, భవానీ మాలధరించిన భవనీలు ఆలయ సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.

ఏపీఆర్సెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ప్రాంతీయ వార్తలు: ఏపీ పరిశోధన ఉమ్మడి ప్రవేశ పరీక్ష(ఏపీఆర్సెట్) 2025-26కు జనవరి 15 వరకు ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది. రూ.2వేల ఆలస్య రుసుముతో జనవరి 16 నుంచి 21 వరకు అవకాశం కల్పించింది. జనవరి 29 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్షలు ఫిబ్రవరి 8 నుంచి 11వరకు కొనసాగనున్నాయి. రోజూ రెండు సెషన్లలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 వరకు నిర్వహిస్తారు. ఈ ఏడాది ఏపీఆర్సెట్ శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయం నిర్వహిస్తోంది

అభివృద్ధి పేరుతో విశాఖలో కొండల విధ్వంసం ఆపాలి

ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం నిలిపివేయాలి: సీపీఐ







ప్రాంతీయ వార్తలు । విశాఖపట్నం । నవంబర్ 20, 2026 అభివృద్ధి పేరుతో విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని నిలిపివేయాలని, ప్రజల అవసరాలు, పర్యావరణ పరిరక్షణే ప్రాధాన్యంగా అభివృద్ధి చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎకరా భూమిని 99 పైసలకే ప్రైవేటు పారిశ్రామిక సంస్థలకు కట్టబెట్టడం అభివృద్ధి కాదని విమర్శించారు. హైదరాబాద్ తరహాలో విశాఖపట్నాన్ని బీటెక్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం, మరోవైపు కొండలను తవ్వుతూ పచ్చని విశాఖ ప్రకృతి అందాలను దెబ్బతీస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రహిమాన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిల్ల పైడిరాజు ఆరోపించారు. శుక్రవారం మధురవాడలోని శ్రీరాం ప్రాపర్టీస్ ఎదురుగా వైజాగ్ టెక్ పార్క్ పేరుతో కొండ ప్రాంతంలో జరుగుతున్న పనులను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ. విమల, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. మన్మధరావు, ఎన్. నాగభూషణరావులతో కూడిన ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రహిమాన్, పైడిరాజు మాట్లాడుతూ గతంలో ఈ కొండపై 40 ఎకరాలను ప్రాక్లిన్ టెంపుల్ టన్ సంస్థకు కేటాయించిన సమయంలోనూ సీపీఐ ఆందోళన చేపట్టిందని గుర్తుచేశారు. యువతకు ఉపాధి, అభివృద్ధి పేరుతో విశాఖ పరిసరాల్లో ఎనిమిదికి పైగా కొండలను ధ్వంసం చేస్తూ పర్యావరణానికి నష్టం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రుషికొండ నిర్మాణాలపై తీవ్రంగా స్పందించిన ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పుడు జరుగుతున్న కొండల తవ్వకాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత పర్యావరణ విధ్వంసంపై విశాఖ ప్రజలకు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని నిలదీశారు. విశాఖ నగర ప్రకృతి అందాలను, పర్యావరణ సమతుల్యతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ విధ్వంసాన్ని తక్షణమే నిలిపివేయాలని, గతంలో ఏర్పాటు చేసిన సిట్ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారుల ఆధీనంలో ఉన్నాయని ఆరోపిస్తున్న వందలాది ఎకరాల విలువైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజల కేంద్రంగా అభివృద్ధి చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జె. అన్వేషి, బి. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తీర్పును జీర్ణించుకోలేక పులివెందులలో గొడ్డలి పార్టీ

అలజడి.. ఈవీఎంలైనా, బ్యాలెట్టైనా ప్రజా మద్దతు కూటమికే

గొడ్డలి పార్టీ అలజడులు సృష్టించి.. టీడీపీపై నిందలు నెట్టే కుట్ర
పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే



అమరావతి, **ప్రాంతీయ వార్తలు:** నవంబర్ 20: ఇటీవల జరిగిన నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు కూటమి పార్టీలకు అండగా నిలిచి సుమారు 95 శాతం విజయాలను అందించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ ప్రజా తీర్పును జీర్ణించుకోలేక గొడ్డలి పార్టీ నేతలు గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పులివెందులలో కావాలనే అలజడి సృష్టిస్తూ, ఆ నెపాన్ని టీడీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతుంటే, పులివెందులలో మాత్రమే వివాదాలు, ఘర్షణలకు ఎందుకు తెరలేపుతున్నారని ప్రశ్నించారు.

గత నాలుగు దశాబ్దాలుగా భయాందోళనల కారణంగా పోలింగ్ కేంద్రాలకు రావడానికి వెనుకాడిన పులివెందుల ప్రజలు, కూటమి ప్రభుత్వంలో తొలిసారిగా ధైర్యంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. ప్రజలు భయాన్ని వీడి ఓటు వేయడాన్ని కూడా గొడ్డలి పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. 2024లో ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లో కూటమికి మద్దతు తెలిపిన ప్రజలు, ప్రస్తుతం బ్యాలెట్ ద్వారా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే మద్దతును కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

సింహాద్రిపురంలో ప్రశాంతంగా సాగుతున్న గ్రామ పంచాయతీ నామినేషన్ల ప్రక్రియలో కడప ఎంపీ, వైసీపీ నేత వైఎస్ అవినాష్ రెడ్డి అనవసరంగా జోక్యం చేసుకోవడం ఏమిటని పల్లా ప్రశ్నించారు. సుమారు 50--70 వాహనాలతో నామినేషన్ల కేంద్రం వద్దకు చేరుకుని అలజడి సృష్టించాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. సింహాద్రిపురం పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీల ఎన్నికల వ్యవహారాల్లో స్థానిక ఓటరు కాని ఎంపీ అవినాష్ రెడ్డి జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. స్థానికులెవరూ మద్దతు కోరని పరిస్థితుల్లో గ్రామస్థులు పరస్పరం చర్చించుకుని తీసుకునే నిర్ణయాలను అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఏకగ్రీవాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం, హైకోర్టు, ఫిర్యాదుల పేరుతో రాజకీయాలు చేయడం తగదని వ్యాఖ్యానించారు.

307 కేసుల్లో నిందితులుగా ఉన్నవారిని వెంటబెట్టుకుని సింహాద్రిపురానికి రావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. అగుడూరు దాడి ఘటనలో పాల్గొన్నవారినే వెంట తీసుకొచ్చి సింహాద్రిపురంలోనూ అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై పల్లా ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్పీని సైతం బెదిరించే ధోరణి ప్రదర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. దుష్యంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, ఇలాంటి దౌర్జన్యాలు, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు.

పులివెందులలో ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకోవచ్చని, ఎన్నికల్లో పోటీ చేసే హక్కును అడ్డుకోవాలన్న ఉద్దేశం టీడీపీకి లేదని పల్లా స్పష్టం చేశారు. అయితే గ్రామాల్లో ప్రశాంతతను చెడగొట్టి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతుంటే పులివెందులలో మాత్రమే గొడవలు సృష్టించి, తిరిగి టీడీపీపై నిందలు వేయడం గొడ్డలి పార్టీ నేతల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ప్రజలు ప్రతి పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారని, ఎవరు ప్రశాంత ఎన్నికలను కోరుకుంటున్నారు.. ఎవరు అలజడులు సృష్టిస్తున్నారో వారికి స్పష్టంగా తెలుసన్నారు. ఈవీఎంలైనా, బ్యాలెట్టైనా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉంటోందని, ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవాలని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ ఆర్చరీ పోటీలకు విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఎంపిక





ప్రాంతీయ వార్తలు: విశాఖపట్నం, నవంబర్ 20, 2026: విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ విమెన్ (అటానమస్) కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం బీటెక్ ఈసీఈ విభాగ విద్యార్థిని ఎన్. మోహిత ఆర్చరీ క్రీడలో ప్రతిభ కనబరిచి దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికయ్యారు. నవంబర్ 19, 2026న విశాఖ వ్యాలీ స్కూల్‌లో రఘు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాల టోర్నమెంట్ మరియు విశ్వవిద్యాలయ ఆర్చరీ ఎంపిక పోటీల్లో మోహిత పాల్గొని తన ప్రతిభను చాటుకున్నారు. ఈ ఎంపిక ద్వారా ఆమె లిదక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయ ఆర్చరీ టోర్నమెంట్‌లిలో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ఈ పోటీలు అస్సాంలోని తేజ్‌పూర్ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 15 నుంచి 22, 2026 వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ డా. టి. సంధ్యా కుమారి, డీన్ -- అడ్మినిస్ట్రేషన్ డా. బి.టి. రామకృష్ణ రావు, ఫిజికల్ డైరెక్టర్ వి. శివ మరియు ఎం. శ్రీనివాస రావు విద్యార్థిని మోహితను అభినందించి, దక్షిణ మండల స్థాయి పోటీల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థినిలోని క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఆమె సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

ఏపీలో 28 జిల్లా ప్రజా పరిషత్‌లకు ఎన్నికలు పూర్తి.. కూటమికి 27 స్థానాలు

అమరావతి, **ప్రాంతీయ వార్తలు:** :నవంబర్ 20: రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నికలు పూర్తయ్యాయి. 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవుల్లో ఒక్క అల్లూరు జిల్లా మినహా మిగతా 27 పదవులు కూటమి పార్టీలు దక్కించుకున్నాయి. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవుల్లో తెలుగుదేశం పార్టీ 22, జనసేన పార్టీ 4, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. దీంతో మొత్తం 27 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులు కూటమి ఖాతాలో చేరాయి. మరోవైపు అల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వైసీపీకి చెందిన వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పేర్లు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీల వివరాలను కూడా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ ముగిసింది.

భీమిలి ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేసిన యరబాల కృష్ణవేణి



భీమిలి, నవంబర్ 19: భీమిలి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా యరబాల కృష్ణవేణి ప్రమాణస్వీకారం చేశారు. మూలకుద్దు - రేఖవానిపాలెం పంచాయతీ ఎంపీటీసీగా యరబాల కృష్ణవేణి ఘన విజయం సాధించారు. గతంలో భీమిలి మండల ఎంపీపీగా పనిచేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమేష్ నాయుడు ఎంపీపీగా యరబాల కృష్ణవేణి, వైస్ ఎంపీపీగా తాటితూరు ఎంపీటీసీ రాంబోతు నాగరాజు చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీపీ యరబాల కృష్ణవేణి మాట్లాడుతూ భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు నేతృత్వంలో భీమిలి మండల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ప్రమాణస్వీకారం అనంతరం సీనియర్ టిడిపి నాయకులు (ఎంపిపి భర్త) యరబాల అనిల్ ప్రసాద్, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు డి.ఏ.ఎన్. రాజు, జిల్లా పశు గ్రామాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సరగడ అప్పారావు, టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు అల్లు రమాదేవి, గరికిన పరుశురాముడు, కనకల అచ్చియ్యమ్మ, గాడు సత్యవతి, చందక ఎర్రయ్యమ్మ, పొన్నూరు రాము, బోని ఈశ్వర్ కుమార్, సరగడ భరతమాత, మజ్జి గౌరి, మైలపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

PRANTIYAVARTHALU ప్రాంతీయ వార్తలు TELUGU DAILY PRGI No : APTEL/25/A0899 నిజం కోసం నిరంతరం

జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా మోటూరు నాగమణి,

వైస్ చైర్ పర్సన్ గా పెంటకోట స్వాతి ఏకగ్రీవ ఎన్నిక

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్







అనకాపల్లి, **ప్రాంతీయ వార్తలు:** నవంబర్ 20: జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మరియు వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక ప్రశాంతమైన వాతావరణంలో జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి విజయ కృష్ణన్ తెలిపారు. శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన చైర్ పర్సన్ మరియు వైస్ చైర్ పర్సన్ ల ఎన్నిక జరిగింది.

రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత, శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయకుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్య బాబు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.ముందుగా జిల్లా కలెక్టర్ జిల్లాలో గల 24 మండలాలలో గెలుపొందిన జడ్పిటిసి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పరవాడ జడ్పిటిసి సభ్యురాలు మోటూరి నాగమణిని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ అభ్యర్థిగా నర్సీపట్నం జడ్పిటిసి అభ్యర్థి సుకల రమణమ్మ ప్రతిపాదించగా, కసింకోట జడ్పిటిసి అభ్యర్థి పొన్నగంటి నాగమణి బలపరిచారు. మిగిలిన జడ్పిటిసి సభ్యులు అంగీకరించడంతో ఏకగ్రీవంగా మోటూరి నాగమణిని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఎన్నికయ్యారు.

జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ గా మునగపాక జడ్పిటిసి సభ్యురాలు పెంటకోట స్వాతిని అనకాపల్లి జడ్పిటిసి సభ్యులు పల్లెల నాగేశ్వరరావు ప్రతిపాదించగా, బుచ్చయ్యపేట జడ్పిటిసి సభ్యురాలు పోతుల భవాని బలపరిచారు. మిగిలిన జడ్పిటిసి సభ్య లు ఆమోదించడంతో ఏకగ్రీవంగా పెంటకోట స్వాతి జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలోని 24 జడ్పీటీసీ (గ్రూప్) స్థానాలకు సంబంధించి 24 మంది సభ్యులు నేడు ప్రమాణస్వీకారం మరియు చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ ఎన్నికకు హాజరయ్యారని తెలిపారు. పరవాడ జడ్పీటీసీ సభ్యురాలు మోటూరు నాగమణి చైర్ పర్సన్ గా మరియు మునగపాక జడ్పీటీసీ సభ్యురాలు పెంటకోట స్వాతి వైస్ చైర్పర్సన్ పదవులకు ఏకగ్రీవంగా (అనానిమస్గా) ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.జడ్పిటిసి సభ్యులు గా తెలుగుదేశం పార్టీ నుండి అమలకంటి రమణమ్మ , అల్లు రామనాయుడు, కనిశెట్టి సన్యాసిరావు, గోరా చంద్రశేఖర్, కోటా నీలవేణి, కురచ రమేష్, పల్లెల నాగేశ్వరరావు, నాగవేణి పురం, గంట్యాడ రమేష్, రమణమ్మ సుకల, పుప్పాల లక్ష్మీనారాయణ, పీలా హైమావతి, లెక్కల సన్యాసి నాయుడు, రొంగలి మహేశ్వరరావు, రాజేశ్వరి కిలపర్తి, సుర్ల సత్యం నాయుడు, స్వాతి పెంటకోట, జనసేన పార్టీ నుండి సేనాపతి రత్నం, మోటూరు నాగమణి, రావి చలపతి, మామిడి అరుణ, పోతుల భవాని, బిజెపి పార్టీ నుంచి పొన్నగంటి నాగమణి, శ్రీరంగం బ్రమరేశ్వరి ఎన్నికయ్యారు. చివరగా రాష్ట్ర హోం శాఖ మాత్యులు వంగలపూడి అనిత తో పాటు శాసనసభ్యులు మరియు కార్పొరేషన్ల చైర్మన్లు గెలుపొందిన జడ్పిటిసి అభ్యర్థులను శాలువ కప్పి సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి -- ప్రభుత్వ రంగ పోర్టుల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను నిలిపివేయాల

పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా



ప్రాంతీయ వార్తలు: విశాఖపట్నం పోర్టులో పనిచేస్తున్న శాశ్వత, కాంట్రాక్టు, నాన్ పర్మనెంట్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వ రంగ పోర్టులను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేసే విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈరోజు పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.ఎస్. పద్మనాభరాజు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ పోర్టులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పోర్టుల ద్వారా దేశానికి ఆదాయం సమకూరుతున్నప్పటికీ, కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.

1పోర్టు ఆసుపత్రుల పరిరక్షణ:

విశాఖపట్నం పోర్టు ఆసుపత్రిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించకూడదు.

– పోర్టు యాజమాన్యం స్వంత నిధులతోనే ఆసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలి.

– అవసరమైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని నియమించాలి.

– కార్మికులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– అవసరమైన మందులు, వైద్య పరికరాలు, వైద్య పరీక్షల సౌకర్యాలు కల్పించాలి.

2. BWNC -- వేతన ఒప్పంద సమస్యలు:

– ద్వైపాక్షిక వేతన చర్చల కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలి.

– 2027 జనవరి 1 నుంచి అమలయ్యే నూతన వేతన ఒప్పందంపై చర్చలను వెంటనే ప్రారంభించాలి.

– గత వేతన ఒప్పందంలో పెండింగ్లో ఉన్న స్టాగ్నేషన్ సమస్యలు, పెన్షన్ సమస్యలు, ఇతర అంశాలను పరిష్కరించాలి.

– కార్మికులకు న్యాయమైన వేతన ఒప్పంద ప్రయోజనాలు కల్పించాలి.

3. ప్రభుత్వ రంగ పోర్టులు -- ఉద్యోగాల పరిరక్షణ:

– ప్రభుత్వ రంగ పోర్టుల కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ విధానాలను తక్షణమే నిలిపివేయాలి.

– పోర్టుల వాటాలను స్టాక్ మార్కెట్లో విక్రయించే విధానాలను రద్దు చేయాలి.

– కోర్, నాన్కోర్ పనుల పేరుతో కార్మికులను విభజించి వారి సంఖ్యను తగ్గించే విధానాన్ని నిలిపివేయాలి.

– ప్రభుత్వ రంగ పోర్టుల స్వభావాన్ని, వాటి ఆస్తులను పరిరక్షించాలి.

– ఖాళీగా ఉన్న శాశ్వత ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి.

– కొత్త ఉద్యోగాలను సృష్టించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి.

– పోర్టులలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

4. పోర్టు ఆస్తులు -- ప్రజాధనం పరిరక్షణ:

– ప్రజాధనంతో చేపట్టే ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

– ఒకవైపు ప్రైవేట్ టెర్మినళ్ల సంఖ్యను పెంచుతూ, మరోవైపు శాశ్వత ఉద్యోగాలను తగ్గించి కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ విధానాలను పెంచే చర్యలను నిలిపివేయాలి.

– కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.

– కార్మికులకు సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలి.

– పోర్టు నిధులు, ఆస్తుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలి.

– ప్రజల ఆస్తులైన పోర్టులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను రద్దు చేయాలి.

5. నాన్ పర్మనెంట్ కార్మికుల సమస్యల పరిష్కారం:

– శాశ్వత కార్మికులు నిర్వహించే నిరంతర స్వభావం కలిగిన పనులు చేస్తున్న ఫుల్టైమ్, క్యాజువల్, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ కార్మికులకు కూడా వేతన ఒప్పంద ప్రయోజనాలు కల్పించాలి.

– కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి.

– ప్రైవేట్ టెర్మినళ్లలో పనిచేస్తున్న కార్మికులకు పోర్టు రంగంలో అమలవుతున్న వేతనాలు, సౌకర్యాలు కల్పించాలి.

– షెడ్యూల్లో లేని కాంట్రాక్టు, స్టీవడోరింగ్, షోర్ కార్మికులకు ప్రత్యేక కనీస వేతనాలు అమలు చేయాలి.

– కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, వారాంతపు సెలవులు, జాతీయ పండుగ సెలవులు, ఓవర్టైమ్ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలి.

– కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పంద ప్రయోజనాలు అమలు చేయాలి.

– పోర్టులో పనిచేస్తున్న కార్మికుల మధ్య విభజనలు సృష్టించే విధానాలను నిలిపివేసి, కార్మికుల ఐక్యతను కాపాడాలి.కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో పోర్టు యాజమాన్యం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ, జె. సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, ఆనందరావు, బి. జగన్, నాయుడు, తాతారావు, నూకరాజు తదితర యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బి జగన్ కార్యదర్శి యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (CITU)

పాపులర్ అవ్వడం కోసమే నా మీద నిందలు



ప్రాంతీయ వార్తలు: మాజీ సీబీఐ డైరెక్టర్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నాగేశ్వరరావు వ్యాఖ్యలపై స్పందించిన సజ్జనార్ నాపై తప్పుడు ఆరోపణలు చేసినవారిపై సమయం వచ్చినప్పుడు కచ్చితంగా చర్యలు తీసుకుంటాను అందరి చరిత్ర అందరికీ తెలుసు ఏదో పాపులర్ అవ్వడానికి నా మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు-- అగ్నిమాపక శాఖ డీజీ సజ్జనార్

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తల్లి కన్నుమూత



ప్రాంతీయ వార్తలు: ఉత్తరాఖండ్లోని పౌరీ జిల్లాలో పంచూర్ గ్రామంలో తుదిశ్వాస తల్లి మరణంతో యోగి ఆదిత్యనాథ్ కుటుంబంలో విషాదం

బంగారం ధరల్లో భారీ తగ్గుదల..

10 గ్రాములపై రూ.5,120 డౌన్!

వెండి ధర కిలోపై రూ.5,000 తగ్గుదల



ప్రాంతీయ వార్తలు: హైదరాబాద్: బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.5,120 తగ్గి రూ.1,25,570కు చేరింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.4,700 తగ్గి రూ.1,15,100 వద్దకు దిగివచ్చింది. మరోవైపు వెండి ధర కూడా తగ్గుముఖం పట్టింది. కిలో వెండిపై రూ.5,000 తగ్గడంతో ధర రూ.1,75,000కు చేరింది.ప్రాంతాలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు. ఈ ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన నూతన జెడ్పీ చైర్పర్సన్ కొరికాన భవానీ

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి: కేంద్ర మంత్రి



ప్రాంతీయ వార్తలు: శ్రీకాకుళం: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును నూతన జిల్లా పరిషత్ చైర్పర్సన్ కొరికాన భవానీ, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్పర్సన్గా బాధ్యతలు చేపట్టిన కొరికాన భవానీకి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.శ్రీకాకుళం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో, సమిష్టి కృషితో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

దక్షిణ కోస్తారైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్షిప్లు, పురస్కారాల ప్రదానం



విశాఖపట్నం, నవంబర్ 20: దక్షిణ కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం (SCORWWO), విశాఖపట్నం డివిజన్ ఆధ్వర్యంలో 18.11.2026న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో స్కాలర్షిప్ల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, IIT-JEE మరియు చీజుజు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన సుమారు 105 మంది విద్యార్థులకు ధ్రువపత్రాలతో పాటు నగదు స్కాలర్షిప్లను అందజేసి ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, సెప్టెంబర్ 2026లో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ మరియు పెయింటింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కూడా ధ్రువపత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం విశాఖపట్నం డివిజన్ అధ్యక్షురాలు శ్రీమతి జ్యోత్స్నా బోహ్రా, ఉపాధ్యక్షురాళ్లు శ్రీమతి గాయత్రి సంతారం, శ్రీమతి కె. సుహాసిని, కార్యదర్శి శ్రీమతి నికితా శర్మ, కోశాధికారి శ్రీమతి నీహారిక పాల్గొని విద్యార్థులకు అవార్డులను అందజేశారు.విద్యార్థుల్లో విద్యాపరమైన ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించడంతో పాటు సృజనాత్మకతను వెలికితీసేందుకు దక్షిణ కోస్తా రైల్వే మహిళా సంక్షేమ సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

PRANTIYAVARTHALU telugu daily published and owned by PILLA SATHISH , Flat No.103, Sree Sai Paradise,D.No.25-34/1/3, Nagarampalem, Madhurawad, Visakhapatnam, A.P - 530048.
Printed at VARUN PUBLICATION ,D.No.5-1-85/7, Main Road Marripalem Visakhapatnam, A.P -530018. Editor : PILLA SATHISH. Flat No.103, Sree Sai Paradise,D.No.25-34/1/3, Nagarampalem, Madhurawada,Visakhapatnam A.P- 530048. Phone : 7842727999. Email : prantiyavarthalu.pvnews@gmail.com PRGI No : APTEL/25/A0899